అప్పటికి శంతన్ మూడు వ్యాసాలు చదివాడు ఆమె రాసినవి. సాంఘిక పరిస్థితులు, పరిణామాల గురించిన ఆమె విశ్లేషణ అతడిని పూర్తిగా ఆకట్టుకుంది. ఎలాగైనా ఆమెను కలుసుకుని మాట్లాడగలిగితే తన చదువుకు సార్థకత ఏర్పడుతుందనుకున్నాడు. తన ఆలోచనలకు ఒక కార్యరూపం కూడా ఏర్పడి భవిష్యత్తు చక్కగా రూపొందించుకోవడానికి అవకాశం ఉంటుందనుకున్నాడు.

అతని ఆకాంక్ష అంత తీవ్రమైనదేమో ఆ అవకాశం ఎదురుగుండా నడుచుకుంటూ వచ్చింది. యూనివర్సిటీ డిపార్ట్‌మెంట్‌లో ఆమె ఎండోమెంట్ లెక్చర్ పై సోమవారం ఇస్తుంది- అన్న వార్త చూసినప్పుడు అతని ఉత్సాహం ఉరకలు వేసింది. మనస్సు అప్పుడే అక్కడకు పరుగులు తీసింది. శారీరకంగా అంతవరకూ వేచి ఉండడం తప్పనిసరి అయినా మానసికంగా ఎక్కడికైనా వెళ్ళవచ్చు గదా! -ఎవరి అనుమతి కూడా అక్కర్లేదు.

ఆమె ఉపన్యాసం విన్నాక అతనికి ఒళ్ళూ, పై తెలియలేదు. ఆమె ప్రస్తావించిన విషయాలు ఇదివరకే అతని మనస్సులో నిండి ఉన్నాయి. ఇప్పుడు ఆమె శరీర లావణ్యాలు అతణ్ణి మరీ మైమరచేట్టు చేశాయి. గుండ్రటి ముఖం అనటానికి వీల్లేదు; కోలముఖం అంతకన్నా కాదు. పోలిక ఆనందంగా ఉందనుకుంటే మామిడిపండుతో సమానం చేయవచ్చు ఆమె ముఖం. ముఖ్యంగా మాట్లాడుతూ ఉన్నప్పుడు బుగ్గలు మాటలతో, గాలితో బాగా ఊరిపోయి మాగిపోయిన మామిడిపండును గుర్తుకు తెస్తాయి. ఆమె తల ఒక పక్కకు తిప్పి, సాలోచనగా విషయాలను వివరిస్తూ ఉన్నప్పుడు ఈ పోలిక మరింత బాహాటంగా కనిపిస్తోంది శంతన్‌కు.

ఉపన్యాసం అయిపోయిన తర్వాత నాలుగైదు ప్రశ్నలకు సమాధానం చెప్పింది ఆమె. చిరునవ్వుతోనూ, చమత్కారంగా కదిలే కళ్ళతోనూ ఆమె ఎలాంటి మూఢుడినైనా రంజింప చేయగలుగుతుందని ధైర్యం చిక్కింది. ఇంక కాగితాలు సర్దుకుంటూ, వెళ్ళిపోతుందేమోనన్న సమయంలో శంతన్ అకస్మాత్తుగా ముందుకు ఉరికి ఆమెను పలుకరించాడు.

'ఎక్స్‌క్యూజ్ మీ -' అన్నాడు ముందు. చిరుమందహాసం చిందిస్తూనే ఆమె 'ఏమిటి?' అన్నట్టుగా చూసింది అతని వంక.

పాతిక సంవత్సరాల యువకుడు. బాగా చదువుకున్న ముఖం. జ్ఞానతృష్ణతో తొణికిసలాడుతూ ఉంది -అని గమనించింది ఆమె.

'గంగాదేవి గారూ! మీ ఉపన్యాసానికి ముగ్ధుడినయిపోయినాను. రేపు మధ్యాహ్నం లంచ్‌కి ఆహ్వానిద్దాం అనుకుంటున్నాను. దయచేసి అంగీకరిస్తారా?' అనడిగాడు శంతన్, ప్రతి మాటనూ తూచి తూచి ఆలోచించిన మీదటనే అన్నాడు.

ఆమె ముఖంలో నవ్వు మాయం కాలేదు.

'అలాగే -' అంటూ ఫోలియో బ్యాగ్‌లో నుంచి విజిటింగ్ కార్డ్ తీసి ఇచ్చింది-అతనికి. 'మధ్యాహ్నం పన్నెండు గంటలకు రండి. రెండు గంటల వరకు నాకు మరేమీ ఎసైన్‌మెంట్ లేదు... అన్నట్టు మీకు తెలుసుననుకుంటాను, నాకో అమ్మాయి ఉంది. అయిదేళ్ళు ఉంటుంది.'

ఆమె మాటలు విన్న తర్వాత వేరే ఆలోచించడం అంటూ అవసరం లేకపోయింది-శంతన్‌కు. ఆమె



# మందాకిని

## — శ్రీవిరించి

తాను ఎవరని గానీ, ఎందుకు లంచ్‌కు ఆహ్వానిస్తున్నావని గానీ అడగనే లేదు. పైగా —నాకో అమ్మాయి ఉంది అని చెప్పింది. అంటే నేను పెళ్ళి అయి సంసారం చేసుకుంటున్న మనిషిని; నా మీద 'ఎకడమిక్' తప్ప ఇతర ఆశలు ఏమీ పెట్టుకోవద్దు-అని ముందే హెచ్చరించడమా? ఆమె వయస్సు అంచనా వేయడానికి ప్రయత్నించాడు శంతన్. ఇరవై నుంచి ముప్పై ఐదు లోపల ఎంతైనా కావచ్చు, అనిపించింది. కానీ ఆమె విద్యార్హతలు, ఉద్యోగ వివరాలు చూస్తే ముప్పయికి తక్కువ ఉండడానికి వీలు లేదు. అయినా ఆడవాళ్ళ వయసు గురించి, మగవాళ్ళ సంపాదన గురించి అడగకూడదు, ఆలోచించకూడదు-అని అంతకుముందే ఎవరో చెప్పారు. అడగడం అనుచితం కావచ్చు, ఆలోచించడం కూడా తప్పేనా? ఏమో!

మరునాడు ఉదయం అంతా అతనికి ఇదే ఆలోచన. మనిషి ఈ భూ ప్రపంచంలో ప్రతి దేశంలోనూ ఉన్నాడు. ప్రతి నేల మీదా విస్తరిస్తున్నాడు. జాతులు, మతాలు, తెగలు, సిద్ధాంతాలు తయారు చేసుకుంటున్నాడు. ఒక దేశం మనిషి మరో దేశం మనిషిని కలుసుకున్నప్పుడు ముందుగా ఆప్యాయత ఉబికిందా, అసూయ ప్రభవించిందా? ఇద్దరూ 'నోట్స్' కంపేర్ చేసుకున్న తర్వాత ఏమనుకున్నారు? వేరు వేరు పద్ధతులు, మనుషులు -ఇప్పుడు ఈ 'సమాచార యుగం'లో 'ఏక గ్రామస్థులు'గా తయారయేంత వరకు ఎలా నాగరికతల, సంస్కృతులు పెంపొందించుకున్నారో గంగాదేవి ఎన్నో ఊహలు, అపోహలు, ఆధారాలు, నిదర్శనాలు పోగుచేసి మరీ చెప్పింది. ఆంత్రోపాలజిస్టుల దగ్గర్నుంచీ తత్త్వవేత్తల వరకు ఆమెకు అన్ని పేర్లూ వేళ్ళ కొనల్లోనే ఉంటాయి. ప్రతి వాటి బేసిక్ థియరీని (మూల సిద్ధాంతాన్ని) దాని పూర్వాపరాల్ని ఆమె పుస్తకాపేక్ష లేకుండానే అనర్గళంగా ఒప్పచెప్పగలదు. వినే వాళ్ళను ఉక్కిరిబిక్కిరి చేయగలదు. ఆమె చెబుతూ ఉన్న విషయాలలో ఏమాత్రం అభిరుచి లేని వాళ్ళు, ఆమెతో ఒక గంటసేపు మాట్లాడిన తర్వాత 'ఆత్మహత్య' చేసుకుందాం అనుకున్నా ఆశ్చర్యం లేదు. ఎందుకు ఈ జీవితం? ఈ జీవితంలో ఏ పరమార్థం ఉన్నదని? అంతే ఏదో స్రవంతిలాగ ప్రవహిస్తూ సముద్రంలో కలిసిపోవడమేనా అంతటికీ తరణోపాయం?

ఆమె ఇంటికి వెళ్ళాడు-ఒక టాక్సీ తీసుకుని. ఇల్లంటే పెద్ద ఇల్లు కాదు. ఓ వసారా... హాలు... పడక గది... వంటకూ వార్పుకూ చిన్న గది. ఇంటి ప్రతి మూలకూ ఏదో చిన్న బల్ల, దాని మీద రకరకాల వస్తు సముదాయం... పిల్లల బొమ్మల దగ్గర్నుంచీ, టి.వి. సెట్ వరకూ.

'సరిగ్గా పన్నెండు గంటలకే వచ్చేసారే! పంక్చువాలిటీ పాటించే వాళ్ళంటే నాకు ఎంతో ఇష్టం' అంది ఆమె, అతణ్ణి లోపలకు ఆహ్వానిస్తూ.

శంతన్ ఏ హోటల్‌కు తీసుకు పోతున్నదీ చెప్పాడు. ఒకటిన్నర గంటలకు ఆమెను ఎక్కడ కావాలంటే అక్కడ 'డ్రాప్' చేస్తానని కూడా చెప్పాడు.

'ఏదీ మీ అమ్మాయి?' అనడిగాడు, తను చెప్పవలసిందంతా పూర్తయి పోయిందనుకున్నాక.

గంగాదేవి నవ్వింది.

'ఈ రోజు స్కూల్ ఉంది గదా! వెళ్ళింది. మళ్ళీ సాయంత్రం నాలుగు అయితేగాని రాదు... అయినా అమ్మాయి ఉంది అని చెప్పాను గాని భోజనానికి తీసుకు వస్తానని అనలేదుగా...'

అతనేమీ వెంటనే జవాబు చెప్పలేదు. ప్రతి మాటకూ బదులు చెప్పాలని ఏమీ నియమం లేదు అతనికి. అందమైన మనిషి. అందులోనూ వివేకం పుణికి పుచ్చుకున్న విశిష్ట వ్యక్తి. ప్రకృతికి ప్రతీకగా

కథ

నిలుస్తుంది ఈమె-అని కూడా అంచనా వేసుకుంటున్నాడు మనసులో.

భోజనం చేస్తున్నప్పుడు అడిగింది ఆమె 'మీరు ఏం చేస్తున్నారు?'

అతను చెప్పాడు, డాక్టొరల్ స్టడీస్ దేన్లో చేశాడో, పోస్ట్ డాక్టరల్ స్టడీస్‌కు ఎలా ఫెలోషిప్ సంపాదించాడో. మరో రెండేళ్ళ దాకా ఏమీ ఇబ్బంది లేదు. ఈ ఫెలోషిప్‌తో గడిచిపోతుంది. తరువాత ఏం చేయాలో-అప్పటి ఆలోచన అప్పుడు!... ఈ లోపల తన మనస్సులో ఉన్న బూజంతా వదిలించుకోవాలి; స్థిమితం చిక్కాలి.

అతను చెప్పేదంతా జాగ్రత్తగా, అతి శ్రద్ధగా విన్నది ఆమె. అతని భవిష్యత్తంతా తాను వినడం మీదనే ఆధారపడి ఉన్నంత 'తమకం'తో విన్నది.

'చాలా బాగుంది మీ ప్లాన్!' అన్నది చివరకు.

'నాకు మీ గైడెన్స్, ప్రోత్సాహం కావాలి!' అన్నాడు శంతన్, ధైర్యం చేసి.

'తప్పకుండా!... అయినా నాకు 'పారలల్ స్టడీస్' చేస్తున్నారు కదా. మనిద్దరి పరిశ్రమా పరస్పరాశ్రయంతోనే ఉన్నట్లుంది. అప్పుడప్పుడు వస్తూ ఉండండి. నాకు తెలీని విషయాలు మీ దగ్గర నేర్చుకుంటాను -' అంది ఆమె చాలా సీరియస్‌గా.

దేవతలు వరం ఇచ్చినట్లు అనిపించింది శంతన్‌కు.

ఆమెతో మాట్లాడడమే ఎన్నో మేరువులు ఎక్కి దిగినట్లు!

వాళ్ళ పరిచయం అలా ముందుకు సాగింది.

'మీ ఫెలోషిప్‌తో వస్తున్న డబ్బు ... పుస్తకాలు, కాగితాలు, ప్రయాణ ఖర్చులకే సరిపోతున్నట్లుంది. ఏం తింటున్నారు?' అంది ఆమె. ఇద్దరికీ మధ్య అనురాగం చిగురులు తొడుగుతోంది అప్పటికి.

'నా ఇంటికి మార్చెయ్యండి మకాం. హాస్టల్ రూం రెంట్ కూడా ఎందుకు దండగ! -' అంది ఒకనాడు సాయంత్రం.

శంతన్ తల ఎత్తి ఆమె ముఖంలోకి అతి సూటిగా చూశాడు. సుకుమారంగా నవ్వుతూనే ఉంది ఆమె. ఉద్దేశం ఏమిటో అర్థం కాలేదు. తొందరపడి మాట పెగిలితే-ముఖం విరూపం పొందుతుందని భయం అతనికి. అయినా, గుండె చిక్కబట్టుకుని అమిత ధైర్యం చేసి అన్నాడు:

'అలాగే మారతాను. కానీ ఓ షరతు...' అని ఒక్క క్షణం ఆగిపోయి ఆమె ముఖంలోకి ఇంక్వయిరింగ్‌గా చూశాడు.

ఏమిటది, చెప్పెయ్యి... చల్లకు వచ్చి ముంత దాచడం ఎందుకు... అన్నట్లుగా ఆమె ముఖం ముందుకు జాపింది. అతనికి ధైర్యం నిలదొక్కుకున్నట్లయింది.

'మనం పెళ్ళి చేసుకుందాం... వివాహ బంధం లేకుండా, ఒకే కప్పు కింద కాపురం చేయడం...'

'ధర్మశాస్త్రాలు ఒప్పవనేనా నీ అనుమానం! ఆపస్తంబుడు, గౌతముడు కాక ఇంకా చాలామంది రాశారు ధర్మసూత్రాలు. అయినా అవన్నీ ఇప్పుడెందుకు గాని, నాకూ ఓ షరతు ఉంది పెళ్ళికి. నీకు ఇష్టం అయితేనే చెబుతాను -' అంది గంగాదేవి.

వాతావరణం ఇంత అనుకూలంగా ఉంటుందని శంతన్ అనుకోలేదు. షరతు ఎలాంటిదైనా నోరు మూసుకుని ఒప్పేసుకోవడమే మంచిపని -అని అతని మనస్సు మూలుగుతోంది.

'నేను ఏం చేసినా ఇదేం అని అడగకూడదు. గతాన్ని గురించి నన్ను ప్రశ్నలు వేయకూడదు... అదొక్కటే షరతు —' అంది.

శంతన్ అకస్మాత్తుగా కూర్చున్న సోఫాలోంచి లేచి, ఆమె రెండు చేతులూ తన చేతుల్లోకి తీసుకుని తన నుదుటి మీద ఆనించుకుని కొన్ని నిమిషాలు పరవశించిపోయాడు. గంగాదేవి అతని పట్టు విడిపించుకున్నాక చేతుల్తో అతని బుగ్గలు నిమిరి, తలంతా తడిమి మరింత దగ్గరకు తీసుకుని పెదవులు కలిపింది.

'ఈ రోజు నా జీవితంలో ఎంతో మధురమైనది-' అని ఉప్పొంగిపోయాడు శంతన్.



సాయంత్రం అమ్మాయిని స్కూలు నుంచి తీసుకు రావడానికి వెడుతున్నప్పుడు చెప్పింది గంగాదేవి: 'రేపటినుంచి ఈ పని నీవే చేయవలసి ఉంటుంది. నీ టైం షెడ్యూల్ ఎలా మార్చుకుంటావో నీ ఇష్టం...'

అప్పటికి అమ్మాయి శంతన్‌కు బాగా అలవాటు అయిపోయింది కూడా.

అతి నిరాడంబరంగా పెళ్లి చేసుకున్నారు ఇద్దరూ; ఇద్దరి తరఫునా పెద్దలు ఎవరూ లేరు. గంగాదేవి ఎవరికైనా తెలిపిందో లేదోగాని శంతన్ మటుకు నాన్నగారికి ఉత్తరం రాశాడు. ఆయన తిరుగు టపాలో ఆక్షేపణగా జవాబు రాయనే రాశాడు: 'నీ ఉద్దేశం నాకేం అర్థం కావడం లేదు. నీ ఫెలోషిప్ డబ్బు నీ ఒక్కడికే సరిపోవడం లేదని ఇన్నాళ్ళూ గోల పెడుతున్నావు. ఇప్పుడు మెడకు ఓ డోలు కూడా కట్టుకుంటున్నావు. ఆమె నీకంటే వయసులో పెద్దదని నీకూ తెలుసు. ఆ డోలుకు ఓ దూడ కూడా ఉందంటున్నావు. పశువుల్ని అలా సంతానంతో సహా కొనుక్కోవడం ఎరుగుదుం గాని... ఇది మనుషులకూ వర్తించడం ఇప్పుడూ చూస్తున్నాం. అయినా నువ్వు మా అనుమతి కోరడం లేదు కదా. విషయం చెప్పావు. అంతకే సంతోషం... మాకు ఇప్పుడు రావడానికి సుతరామూ కుదరదు. పై సంవత్సరం బతికి బాగుంటే కలుసుకుందాం.'

ఈ ఉత్తరం గంగాదేవికి చూపిద్దాం అనుకున్నాడు. ఆ పనీ అనవసరం అనిపించింది. పెళ్ళి సర్టిఫికెట్‌తో పాటు 'పిన్' చేసి ఫైల్లో ఉంచేశాడు; ముందు ముందు ఎందుకైనా పనికి వస్తుందని.

గంగాదేవి కూతురు అతనికి బాగా మాలిమి అయింది. ఆ అమ్మాయి పనులన్నీ అతనే మీద వేసుకున్నాడు-స్నానం చేయించడం, దుస్తులు తొడిగించడం, స్కూలు-పాఠాలు, వినోదాలు -పార్కులు -బజారు పనులు అన్నీ. వీటివల్ల అతనికి ఎంతో నూతనోత్సాహం కూడా వస్తున్నట్లు అనిపించింది.

అమ్మాయి ఇప్పుడు తల్లి దగ్గరకే పోవడం లేదు. అప్పుడప్పుడు తల్లి మాటను కాదని కూడా ప్రవర్తిస్తోంది.

'అమ్మాయిని చెడగొడుతున్నావు'-అని హెచ్చరించింది గంగాదేవి ఒకమారు. 'నేనా? అమ్మాయినా?...' అని ఆశ్చర్యపోయాడు శంతన్.

'ఇప్పుడు నా మాట బొత్తిగా వినడం లేదు. ఏం కావాలన్నా నిన్నే అడుగుతోంది. నేనా తల్లిని, నీవా?' అంది కోపంగా.

'అమ్మాయంటే నాకు అభిమానం ఉన్న మాట నిజమే. మమకారం పెరుగుతున్న మాటా యదార్థమే. అయినా నేను తల్లిని ఎట్లా అవుతాను? గంగాదేవే తల్లి... నేను పరాయి నాన్ననే!' అన్నాడు శంతన్ తల ఒంచుకుని.

'ఊరికే అన్నాను. అలా చిన్నబుచ్చుకోకు. అమ్మాయి నీకు దగ్గర కావడమే నాకూ కావలసింది' అని గంగాదేవి అతణ్ణి దగ్గరకు తీసుకుని అప్యాయంగా తల నిమిరింది. 'అమ్మాయి సేవా కార్యక్రమాలతో నీ చదువు సంధ్యలు పాడుచేసుకోకు. నీ ఫెలోషిప్ అయేటప్పటికి నువ్వు నీ కాళ్ళ మీద నిలబడగలగాలి! ఇంకో ఆరు నెలలే ఉంది సమయం'-అని గుర్తు చేసుకున్నాడు శంతన్.

గంగాదేవి ధర్మమా అని తన చదువుల సంగతి కూడా చాలా చురుకుగా, చలాకీగా జరిగిపోతోంది. అనుమానాలు ఇంకా స్థిరీకరణ కాకుండానే సమాధానాలు దొరుకుతున్నాయి.

శంతన్ తల్లీ తండ్రీ వచ్చారు ఒకమారు, చెప్పాపెట్టకుండా.

గంగాదేవితో వాళ్ళకేం పేచీ లేదు. అమ్మాయి గురించే గుంజాటన. 'మరీ ఇంత పీలగా ఉందేం? ఈమె నాన్న కూడా ఇలాగే సన్నగా సలాకలాగ ఉండే వాడా?' అని అడగడం ప్రారంభించింది అతని తల్లి.

శంతన్‌కు సమాధానం తెలియలేదు. గంగాదేవి వాళ్ళ సంభాషణలు వినీ విననట్లుగా ఊరుకుంది.

'కోడలుకు ఏం ఉద్యోగం? రోజంతా బయట మీటింగులతో సరిపోతుందా?... హాయిగా ఇంటిపట్టున ఉండే కోడలు కావాలని మేము ఎంత కలవరించామో నీకు తెలియదు... మన ఊరుకు రమ్మంటే వస్తుందా ఎప్పటికైనా? కోడలును తీసుకు వస్తావా? నువ్వు రమ్మంటే వస్తుందంటావా? మనసు విప్పి మాట్లాడదాం అనుకుంటాను... కానీ ఆమెకు ఒక్క క్షణం అయినా తీరిక ఉండదు కదా...' ఇదీ తల్లిదండ్రుల నస. ఇదంతా గంగాదేవి చెవిని పడకుండా, మనసులో దూరకుండా, వేరే అభిప్రాయాలకు దారి తీయకుండా .

బయటపడడం అతనికి ఇబ్బంది అయిపోతోంది.

వాళ్ళు స్వగ్రామం వెళ్ళిపోయేంత వరకూ ఎలాగో ఒళ్ళంతా కళ్ళు చేసుకుని చెవులు చేసుకుని తనను తాను కాపాడుకోగలిగాడు శంతన్.

వాళ్ళు వెళ్ళిపోయిన తరువాత జీవితం కొత్త అధ్యాయం ప్రారంభం అవుతున్నట్లు అనిపించింది.

నదులు, నదాలు దాటి పరిసర ప్రాంతాలలో జన జీవనం, సామాజిక స్థితిగతుల్లో సంస్కృతీ పరిణామాలు... ఈ విషయం మీద సమగ్రంగా చదవడం, నోట్స్ రాసుకోవడం పూర్తయింది. పదిహేను రోజులు ఓపిగ్గా కూర్చుంటే వంద పేజీల పుస్తకం తయారవుతుంది. ఎంతో ముందుచూపు... మందాకినీ ప్రవాహ వేగంతో జీవితం కొత్తగా అర్థం అవుతోంది.

నదులను గురించి ఈ పుస్తకాధ్యాయం అయిపోయాక, పర్వతాల మీద పడాలి. పర్వతాలకు, నదులకు ఏమిటి సంబంధం? పర్వతం, సముద్రం కలిసిన తావులు ప్రపంచంలో ఎక్కడెక్కడ ఉన్నాయి? అక్కడ ప్రత్యేక నాగరికతలు విస్తరిస్తాయా?... ఇదంతా జాగ్రత్తగా పరిశీలించాలి. మనిషికి, నదికి, పర్వతానికి ఏమిటి అనుబంధం? ఒకటి ఎప్పుడూ కదిలిపోతూ ఉంటే మరోటి ఎప్పటికీ కదలకుండా భూస్థాపితంగా ఉండిపోతుంది. పురాణాలలో పర్వతాలకు రెక్కలుండేవి, ఎగరడాలు ఉండేవి. ఎవరో ఈ రెక్కలు విరిచేసి వాటిని 'అచలాలు' చేశారు. అగస్త్యుడయితే ఓ పర్వతాన్ని నేలబారు చేసేశాడు. పర్వతాల మీద చెట్లు, వాగులు, భవనాలు, ఖిల్లాలు, దేవాలయాలు, గంధర్వులు, సుగంధ ద్రవ్యాలు... ఇలా ఎన్నో జన్మ తీసుకుంటాయి. కల్పాంతం కదలకుండా ఎదుగుతాయి. కొండ మీదికి రాళ్ళ మెట్లు కాదు, ఇప్పుడు రైలు మార్గాలూ ఉన్నాయి! మనిషి ప్రకృతిని అర్థం చేసుకుని ముందుకు పోతున్నాడు. మూలవిరాట్టులా తయారవుతున్నాడు.

అమ్మాయికి ఆటవస్తువులు కొంటున్నప్పుడు ఈమెకో చిన్న తమ్ముడినీ, చిన్న చెల్లాయినీ ఇస్తే ఎలా ఉంటుందీ అనిపించింది శంతన్‌కు. ఒక్క రోజులో అయ్యే పని కాదు. రెండు సంవత్సరాల ప్రణాళిక. తనకు ఇంతవరకు తోచనందుకు నిందించుకున్నాడు. ఈ ప్లాన్ గంగాదేవి ముందు ఉంచాలి. ఆమె ఆలోచన ఏమిటో తెలుసుకోవాలి.

ఆ రోజు గంగాదేవి చాలా చలాకీగా ఉంది. మీటింగ్ బ్రహ్మాండంగా నడిచింది. ఆమె ప్రతిపాదించిన సిద్ధాంతాలన్నీ పండితులకు -స్కాలర్లకు-ఎంతో నచ్చాయి. ఆమె విశేష పరిశ్రమను, విశ్లేషణ రీతులను వాళ్ళంతా ఎంతో శ్లాఘించారు.

శంతన్‌కు వాళ్ళంతా తననే పొగుడుతున్నారా అనిపించింది, చాలా సేపు. 'గంగాదేవి అయితేనేం? శంతన్ అయితేనేం? మానవ జీవితానికి కొత్త అర్థం కల్పించడానికి పూనుకున్న వ్యక్తులు. వాళ్ళ మాదిరి 'ఎకడెమిక్ ఇంటరెస్ట్, ప్రాగ్మాటిక్ అప్రోచ్' ఉన్న వాళ్ళు ఓ వందమంది ఉంటే ఈ సృష్టి రహస్యాలను రెండు నెలల్లో బద్దలు కొట్టెయ్యవచ్చు-' అన్నాడు ఒక జ్ఞానవృద్ధుడు; తన గడచిపోయిన వయసును కూడా నెమరు వేసుకుంటూ... 'యాభై సంవత్సరాలు ఏకబిగిన స్టడీస్ చేశాను. అయినా నా వయసులో మూడోవంతు కూడా లేని గంగాదేవి, శంతన్ కనిపెట్టిన కొత్త సూత్రాలు...' అంటూ ఒకే తీరున పొగడడం ప్రారంభించాడు.


మీటింగ్ అయిపోయి ఇంటికి వచ్చిన తరువాత, వాళ్ళిద్దరూ భోజనాలు చేసేసి తీరుబడిగా కూర్చున్నారు. అమ్మాయి అప్పుడే నిద్రపోతోంది.

'గంగాదేవీ!' అన్నాడు శంతన్ —తను చెప్పదల్చుకున్న దానికి నాందిగా. ఆమెను పేరు పెట్టి పిలవడం ఇది మూడోసారో, నాలుగోసారో -అంతే!

'ఊ-చెప్పు, శంతన్!' అంది ఆమె ముసిముసిగా నవ్వుతూ.

'అమ్మాయికి ఆడుకోవడానికి బొమ్మలు తీసుకురావడం మానేస్తాను ఇంక-' అన్నాడు.

'అవును. అమ్మాయి పెద్దదవుతోంది. బొమ్మలు అవసరం లేదు!'



'నా ఉద్దేశం అది కాదు.'

'మరేమిటి?'

'వయస్సు ఎంతయినా ఆడుకుందుకు బొమ్మలు కావల్సిందే -మనుషులందరికీ. కాకపోతే, ప్రాణం ఉన్న బొమ్మలు కావాలి... మనుషులు పెరిగిన కొద్దీ-' అన్నాడు శంతన్.

గంగాదేవి అర్థం అయీ అవనట్లు ఉండిపోయింది.

'ఈ రెండేళ్ళలో నీవు కాస్త ఒళ్ళు చేశావు, శంతన్' అంది.

అతను మాత్రం అనుకున్నాడు -గంగాదేవి మొదటి రోజున తాను చూసినప్పుడు ఎలా ఉందో ఇప్పుడూ అలాగే చలాకీగా, సీరియస్‌గా, మామిడి మూర్చు ముఖంతో, వివేక శాఖలు విస్తరించిన మస్తిష్కంతో... అలానే ఉంది.

'అమ్మాయికి ఒక చెల్లెలినీ, తమ్ముడినీ ఇవ్వాలని అనిపిస్తోంది నాకు-' అన్నాడు శంతన్.

'అలానే ఇవ్వు. బజారుపనంతా నీదేగా!'

ఇవి బజార్లో కొనుక్కు వచ్చేవి కాదు; ఇంటి దగ్గరే తయారు చేయవలసినవి -అని చెప్పడం ఎలాగో అర్థం కాలేదు శంతన్‌కు.

'అలాగా! అలాగా! నువ్వు ఒప్పుకుంటే అలాగే-అలాగే -' అన్నాడు ఏం మాట్లాడుతున్నాడో తెలియకుండా, అర్థం కాకుండానే.

'పిచ్చి శంతన్! నీకూ ఎన్నో ఆశలు, ఆకాంక్షలు ఉన్నాయి. మీ గ్రామం వెడతావా ఫెలోషిప్ అయిపోయాక?' అనడిగింది గంగాదేవి.

'ఊహూ... ఆ యూనివర్సిటీ నుంచి ఉత్తరం వచ్చింది. డీన్ ఆఫ్ స్టడీస్‌గా జాయిన్ అవమని! ఫెలోషిప్ పీరియడ్ అయినాక, ఓ రెండు నెలలు విశ్రాంతి తీసుకుని, తరువాత జాయిన్ అవుదాం అనుకుంటున్నాను. నీ ఉద్దేశం ఏమిటి?'

'ఏ ఉద్దేశాలు లేకుండా ఉండడమే నా ఉద్దేశం అని నీకు బాగా తెలుసునుగా శంతన్!' అని ఆమె అతణ్ణి దగ్గరకు తీసుకుని సముదాయించింది. అతని ఆలోచనల్ని నిద్ర పుచ్చింది.

మరునాడు తెల్లవారిన తర్వాత గంగాదేవి కనిపించలేదు. ఆమె పుస్తకాలు, కాగితాలు, వస్తువులు ఏమీ ఇంట్లో లేవు.

బల్ల మీద ఓ కాగితం మటుకు అగుపించింది; గంగాదేవి దస్తూరితోనే. అప్పటికి అమ్మాయి స్కూలుకు వెళ్ళిపోయింది.

'శంతన్ నీ సహవాసానికి థాంక్స్.

కాంట్రాక్ట్ పీరియడ్ అయిపోయింది. నా కోసం వెదకకు. ఎవరో నాతో వదిలిన అమ్మాయి నీ దగ్గర క్షేమంగా ఉంటుందని నాకు నమ్మకమే. నా నమ్మకాలు వమ్ము కావు-'.

- శంతన్‌కు ఏడుపు వచ్చింది.

నీ మాట ఏది కాదన్నాను? నిన్ను ఏమీ ప్రశ్నించలేదే! ఎందుకిట్లా అన్యాయం చేశావు?... అని పెద్దగా అడిగాడు ఆమె ఫోటో వంక చూస్తూ.

అదే చిరునవ్వు.

అదే చల్లటి చూపు.

అదే మామిడిపండు ముఖం...

అతని వంక నిరుత్తరంగా చూస్తూ ఉండిపోయింది.

ఉన్నట్టుండి -అతనికి ఎంతో భయం వేసింది. హడావుడిగా దుస్తులు వేసుకుని అమ్మాయి బడికి వెళ్ళాడు. వేగంగా 'ప్రిన్సిపాల్' గదికి వెళ్ళాడు.

'మా అమ్మాయి... మా అమ్మాయి... క్లాసులో ఉందా!' అని అడిగాడు.

ప్రిన్సిపాల్‌కు అతని అయోమయం ఏమీ అర్థం కాలేదు.

'ఉదయం మీరేగా తీసుకు వచ్చి దిగవిడిచారు! ఎక్కడికి పోతుంది? క్లాసులోనే ఉంటుంది, మీరు మళ్ళీ సాయంకాలం వచ్చే వరకూ-' అంది.

'కాదు, కాదు. చూడండి. ప్రిన్సిపాల్. దయచేసి కబురు చేయండి.'

ఇంకా అయోమయం అతణ్ణి వదలలేదు.

క్లాస్ టీచర్‌తో పాటు అమ్మాయి కదిలి తన వైపు వస్తూ ఉంటే, అతని కన్నీళ్ళు ధారగా మారి చూపుకు ప్రతిబంధకం అవుతున్నాయి. ప్రయత్న పూర్వకంగా అమ్మాయి ముఖంలోకి గుచ్చి గుచ్చి చూస్తూ ఆతురత అంతా తన ముఖంలో ముద్రించుకున్నాడు.

'ఏమిటి -అట్లా చూస్తారు? మీ అమ్మాయే -' అంటోంది ప్రిన్సిపాల్.

'అవును. అవును-' అంటూ అతను అమ్మాయిని దగ్గరకు తీసుకున్నాడు. తల్లీతండ్రీ లేని ఈ పిల్లకు చెల్లినీ, తమ్ముడినీ ఇవ్వడం ఇక వీలు కాదు. అన్నీ తానే అవడం మటుకే సాధ్యం. ●